# మబ్బుల్లో బొమ్మ

## (నాటకం)

✶ ఈ

# మబ్బుల్లో బొమ్మ

## (నాటకం)

### పాత్రలు

ప్రయోక్త

1వ. ప్రేక్షకుడు

2వ. ప్రేక్షకుడు

3వ. ప్రేక్షకుడు

యువకుడు

యువతి

అతడు

ఆమె

నాటిక : మబ్బుల్లో బొమ్మ

ప్రదర్శకులు : సృజన ఆర్ట్స్ - శ్రీకాకుళం

## ప్రదర్శనా వివరాలు

| ప్రదర్శన తేది | స్థలము - చిరునామా | వివరాలు |
|---|---|---|
| 1. 1.7.2000 | శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య, బాపూజీ కళామందిర్, శ్రీకాకుళం | ఎగ్జిబిషన్ ప్లే. |
| 2. 17.12.2000 | చిత్తూరు జిల్లా స్వర్ణోత్సవాల సందర్భంగా, చిత్తూరు మున్సిపాలిటీ వారు | ఎగ్జిబిషన్ ప్లే. |
| 3. 19.12.2002 | చిత్తూరు జిల్లా స్వర్ణోత్సవాల సందర్భంగా, మదనపల్లి మున్సిపాలిటీ వారు | ఎగ్జిబిషన్ ప్లే. |
| 4. 8.2.2001 | స్టేట్ బేంకు జోనల్ కాంపిటీషన్సు SBI వారు (VSP) విజయనగరం | ఉత్తమ నాటిక, ఉత్తమ రచన, ఉత్తమ హాస్యనటుడు, ఉత్తమ దర్శకత్వం, ఉత్తమ విలన్‌కూ బహుమతులు |
| 5. 23.2.2001 | స్టేట్ బ్యాంకు స్టేట్ కాంపిటీషన్సు SBI వారు (VSP) విజయవాడ | ద్వితీయ ఉత్తమ నాటిక, ఉత్తమ రచన, ఉత్తమ దర్శకత్వం, ఉత్తమ కమేడియన్‌కూ బహుమతులు |

| | | | |
|---|---|---|---|
| 6. | 24.2.2001 | కళాజగతి వార్షికోత్సవాల సందర్భంగా త్యాగరాయ గానసభ, హైదరాబాద్ | ఎగ్జిబిషన్ ప్లే |
| 7. | 16.4.2001 | శ్రీవెంకటేశ్వర నాటిక కళాపరిషత్, ఆలిండియా కాంపిటీషన్సు, తిరుపతి | ఉత్తమ రచన, ఉత్తమ రంగాలంకరణ బహుమతులు |
| 8. | 8.6.2001 | జిల్లా పారిశ్రామిక ప్రదర్శన, ఎగ్జిబిషన్ కళా ప్రాంగణం, శ్రీకాకుళం | ఎగ్జిబిషన్ ప్లే |
| 9. | 10.6.2001 | నట సమాఖ్య. నెల్లూరు జిల్లా రాష్ట్ర స్థాయి నాటికల | ద్వితీయ ఉత్తమ నాటిక, ఉత్తమ రచన, ఉత్తమ పోటీలు |
| 10. | 14.7.2001 | షిప్‌యార్డ్ కళాప్రాంగణం, ఉత్తరాంధ్ర ఆహ్వాన నాటికల పోటీలు, విశాఖపట్నం | ఉత్తమ రచన, ఉత్తమ దర్శకత్వం, ఉత్తమ కమేడియన్ బహుమతులు |
| 11. | 23.12.2001 | ప్రవాసాంధ్ర నవ్య కళా పరిషత్, ఆలిండియా నాటికల పోటీలు, ఖరగ్‌పూడర్ | ఉత్తమ నటి బహుమతి |
| 12. | 16.2.2001 | APSRTC ఆర్ట్సుకో రాష్ట్ర స్థాయి నాటికల పోటీలు, అనంతపురం | ఉత్తమ నాటిక, ఉత్తమ రచన, ఉత్తమ దర్శకత్వం, ఉత్తమ ద్వితీయ నటుడు బహుమతులు |

| | పాత్రలు | | పాత్రధారులు |
|---|---|---|---|
| 1. | ప్రయోక్త | – | 1. రవితాయి (సృజనా)<br>2. ఎన్.పి. ప్రసాద్ (SBI)<br>3. వి.వి.ఆర్. మూర్తి (RTC) |
| 2. | యువకుడు | – | 1. వి. నాగభూషణం |
| | | – | 2. రవితాయి |
| | | – | 3. ఎన్.పి. ప్రసాద్ |
| | | – | 4. బి. లక్ష్మణరావు |
| 3. | అతడు | – | 1. కె. ఆదినారాయణ |
| | | – | 2. వి. శ్రీమన్నారాయణ |
| 4. | 1వ ప్రేక్షకుడు | – | 1. బి. గణేశ్ |
| | | – | 2. ఎన్. ప్రసాద్ |
| | | – | 3. ఎన్.పి. సుబ్బారావు |
| | | – | 4. డి. నీలయ్య |
| 5. | 2వ ప్రేక్షకుడు | – | 1. బి గణేశ్ |
| | | – | 2. బి.వి. మోహనరావు |
| | | – | 3. బి. లక్ష్మణరావు |
| | | – | 4. ఎన్. ఆదినారాయణ |
| | | – | 5. కె.వి.ఎస్.ఎన్. మూర్తి |
| 6. | 4వ ప్రేక్షకుడు | – | 1. ఆర్.డి. ప్రసాద్ |
| | | – | 2. ఎన్.పి. ప్రసాద్ |
| | | – | 3. బి. గణేష్ |
| | | – | 4. బి. సోమేశ్వరరావు |
| 7. | యువతి | – | 1. కుమారి ఎన్. క్రాంతి |
| | | – | 2. శ్రీమతి ఎ. సుష్మా |
| | | – | 3. శ్రీమతి శివజ్యోతి |
| | | – | 4. శ్రీమతి హేమ |
| 8. | ఆమె | – | 1. శ్రీమతి రాఘవకుమారి |

దర్వకత్వం : **ఎన్.పి. ప్రసాద్**
సంగీతం : **ఆర్. సూరన్నాయుడు**
మేకప్ : **కె. నగేష్**
ఆర్గనైజరు : **ఇప్పిలి శంకర్రావు**
సహకారం : **ఎమ్.ఎస్. గుప్త**

**2000 సం॥ నంది నాటిక పోటీలో 'లలితాకళా' కర్నూలు వారు**
**ఈ నాటికను ప్రదర్శించారు.**
**ఉత్తమ రచనగా నంది బహుమతి పొందింది**

**ఆనాటి నటీనటవర్గం**

| | | |
|---|---|---|
| ప్రయోక్త యువకుడు<br>యువకుడు | } | శ్రీ భవానీప్రసాద్ |
| యువతి | : | శ్రీమతి భారతి |
| అతడు | : | శ్రీ స్వామియాదవ్ |
| ఆమె | : | శ్రీమతి ఇందిర |
| 1. ప్రేక్షకుడు | : | శ్రీ టి.వి. రెడ్డి |
| 2. ప్రేక్షకుడు | : | కరుణాకర్‌బాబు |
| 3. ప్రేక్షకుడు | : | శ్రీ యమ్. సంజన్న |
| దర్శకత్వం | : | **శ్రీ యమ్. సంజన్న** |
| లైటింగ్ | : | **శ్రీ బి.జి. రాజ్‌కుమార్** |
| నిర్వహణ | : | **యునైటెడ్ క్లబ్, కర్నూలు** |
| రంగాలంకరణ | : | **శ్రీ యమ్.డి. క్రిష్టోఫర్** |

# మబ్బుల్లో బొమ్మ

## (నాటకం)

**(తెర తొలిగింది - ప్రయోక్త ప్రవేశించాడు)**

**ప్రయో :** కళాకారులకూ, కళాభిమానులకూ, కళాప్రియులకూ, కళాపోషకులకూ, కళాభివందనాలు... మా నాటకం చూడటానికి వచ్చిన మీ అందరికీ స్వాగతం...

ప్రకృతిలో పంచభూతాలకు ప్రతీకలు మనలోని పంచేంద్రియాలు. మానవుడిని దానవుడిగా ఆర్చినా, మహనీయునిగా మార్చినా అది పంచేంద్రియాలకే సాధ్యం...

ఈ పంచేంద్రియాలు అనబడే అయిదు గుర్రాలు పూన్చిన ఈ మానవరథం. ఎటువైపు ప్రయాణించాలి! ఈ ప్రయాణానికి గమ్యం ఏమిటీ?... ఎందుకు?... ఎంతవరకూ అనే తాత్విక మీమాంసకు పరిష్కారంగా ఎన్నో కళలు, ఆ వేదాంత జిజ్ఞాసకు సమాధానంగా మరెన్నో కళారూపాలు వెలిశాయి. పరమోత్కృష్టమైన ఆ కళా రూపాల్లో నాటకం కూడా ఒకటి. అందుకే... "కావ్యేషు నాటకం రమ్యం" అన్నారు.

అలాంటి రమ్యమైన నాటకాన్ని వ్రాయడం ఒక యాగం, వేయడం ఒక యోగం, చూడటం ఒక భోగం... ఇక చూడకపోవడం –

**ప్రేక్ష :** (Audience నుంచి కేక) ఒక రోగం...

**ప్రయో :** Correct Sir... అలాంటి రోగం మీకెవ్వరికీ లేదని నిరూపించారు. ఆ రోగం ఇంకెవ్వరికీ రాకూడదనే ఆ నటరాజ స్వామిని మనసారా ప్రార్థిస్తున్నాను... Dear friends!.. ఈ రోజు మీముందు ఒక కొత్త పద్ధతిలో నాటకాన్ని ప్రదర్శించబోతున్నాం.

ముందుగా మా పాత్రధారులను మీకు పరిచయం చేస్తాను.

(ప్రేక్షకుల్లోంచి ఓ ప్రేక్షకుడు లేచాడు)

**1. ప్రేక్ష :** ఏటీ?... పాత్రల పరిచయమా?... ఏందయ్యా ఇది... నాటకం అయిపోయినాక గదా పాత్రల్ని పరిచయం చేసేది?

**ప్రయో :** క్షమించాలి. నేనన్న మాట మీరు సరిగ్గా విన్నట్లు లేదు... నేను చెప్పింది పాత్రల పరిచయం కాదండీ, పాత్రధారుల పరిచయం మాత్రమే. మరోసారి

విన్నవిస్తున్నాను... ఇది పాత్రల పరిచయం కాదు, పాత్రధారుల పరిచయం మాత్రమే... (కుడివైపు నుండీ పాత్రధారులు వస్తారు. వాళ్ళను పరిచయం చేస్తాడు ప్రయోక్త)

వీరు శ్రీ... వీరు శ్రీమతి...

డియర్ ఆడియన్స్. ఇప్పుడు మీకు పరిచయం చేసిన కళాకారులు మీ ముందు ఒక సన్నివేశాన్ని ప్రదర్శిస్తారు... but-నో డైలాగ్స్... మాటలుండవు. ఆ సన్నివేశం చూశాక ఆ కథేమిటి?... అందులో ఎవరెవరు ఏఏ పాత్రధరించారు అనేది మీరు చెప్పగలగాలి... కరెక్ట్‌గా చెప్పిన వాళ్ళకు మంచి బహుమానం ఉంటుంది.

**1. ప్రేక్ష :** (ప్రేక్షకుల్లోంచి వచ్చాడు) ఇదుగో డైరెక్టరూ... కొంచెం ఆగు...ఏంటీ' డైలాగులుండవా?... ఎవరెవరు ఏఏ పాత్ర వేశారో మేమే చెప్పాలా? ఇంక నువ్వేందయ్యా చెప్పేది!

**ప్రయో :** అదేసార్... డైలాగుల్లేకుండా సన్నివేశం ప్రదర్శిస్తాం... అది పూర్తయ్యాక వారేం మాట్లాడుకున్నారో, వారి మధ్య ఏం జరిగిందో ఊహించి, కరెక్ట్‌గా చెప్పిన వాళ్ళకు మంచి బహుమానం కూడా ఇస్తాం.

**1. ప్రేక్ష :** అర్రె! మళ్ళీ అదేమాట, డైలాగుల్లేకుండా నాటకం ఏంటయ్యా?

**2. ప్రేక్ష :** (Stage మీదికి వచ్చాడు) అరె! అన్నా. మనం చిన్నప్పటి సందీ మూగ సినిమాలు సూళ్ళే....గసొంటిదన్నమాట !

**1. ప్రేక్ష :** అట్టనా...?... అదే ఎందుకూ అంటున్నా.

**ప్రయో :** సార్... ఈ రోజుల్లో కోట్లరూపాయలు పారితోషికం తీసుకునే పెద్ద పెద్ద స్టార్లు నటించిన సినిమాల్లో కూడా ప్రేక్షకుల్ని ఆకర్షించడానికి రకరకాల పోటీలు పెడుతున్నారు. అదేనండీ, మా సినిమాలో హీరో ఎన్నిరకాల డ్రెస్సులు వేశాడు, మా హీరోయిన్ ఎన్నిసార్లు ఏడ్చిందీ, ఎన్నిసార్లు నవ్విందీ అని.

**2. ప్రేక్ష :** అరె! సినిమాలల్లో ఏందివయ్యా! గా T.V సీరియల్లో సూడరాదూ–మా సీరియల్‌లో విలన్‌గాడెవరు?... చివరికేమైతదీ, వారం రోజుల లోపట బరాబర్ రాసినోల్లకి ఈనాములిస్తామనడం లే!

**ప్రయో :** కద...?...మరి అలాటపుడు మేమేదో సాధారణ లైటింగ్‌తో, తెరలతో నాటకం ఆడుతూన్నం చూడండి బాబూ అంటే ఎవరు చూస్తారు సార్...? అందుకే ప్రేక్షకుల్ని ఆకర్షించడానికి మేమూ చిన్న పోటీలాంటిది పెట్టాం...కరెక్ట్‌గా చెప్తే బహుమానం ఇస్తాం.

**1. ప్రేక్ష :** అంటే క్విజ్జా?

**ప్రయో :** అలాగే అనుకోండి !

**1. ప్రేక్ష :** వార్నీ పాసుగూలా! ఈ పోటీల రోగాన్ని నాటకరంగానిక్కూడా అంటించారన్నమాట... ఇంతకాలం ఈ రంగమైనా బాగుందనుకున్నా. అయిపోయింది. ఇదీ నాశనమైంది... యోవ్! ఏందయ్యా ఇంకా కూచున్నారు... ఇట్టాటి నాటకం సూణ్ణీకా మనం వచ్చింది? పదండి... పదండి.

**ప్రయో :** సార్... సార్... ఆగండి సార్... నా మాట వినండి సార్...

**1. ప్రేక్ష :** ఏందయ్యా వినేది !... నేను సిన్నపుడే పుట్టినోడిని. ఇంతప్పటి నుంచీ నాటకాలు సూస్తానే వున్నా... నీ పద్ధతి సూత్తావుంటే అయిదు నిమిషాలు నాటకం చూపించి, కమర్షియల్ బ్రేకూ... అంటావు. ఆ సబ్బు వాడండీ, ఈ నూనె రాసుకోండీ అని అడ్వర్‌టైజ్‌మెంట్లు కూడా సూపిచ్చేట్టుండావే!

**ప్రయో :** కంగారు పడకండి సార్... మా నాటకంలో అడ్వర్‌టైజ్‌మెంట్స్ వుండవు.

**1. ప్రేక్ష :** ఎందుకనీ?

**ప్రయో :** ఎందుకంటే – మా నాటకానికి స్పాన్సరర్స్ లేరు సార్!

**1. ప్రేక్ష :** అసలు నాకు తెలీకడుగుతా – నువ్వీడికి నాటకం ఎయ్యడానికి వచ్చావా? లేక మమ్మల్ని ఎర్రినాకొడుకుల్ని చేయడానికి వచ్చావా?

**2. ప్రేక్ష :** ఏంది భయ్, గప్పటిసంది సూస్తున్నా... ఊక్క లొల్లి పెడ్తన్నావు. ఆళ్ళేదో ఏస్తామంటున్నారు. సప్పుడు సెయ్యకుండా సూసి పోరాదూ...

**1. ప్రేక్ష :** ఏందయ్యా ఆళ్ళు ఏసేది... అన్నీ మనమే చెప్పాలంట. ఇంకేందయ్యా ఈడేసేది నా బొంద.

**2. ప్రేక్ష :** అర్రె! అదిగాదు భయ్, మనం ఈడి కెందుకొచ్చినం? నాటకం సూణ్ణీకి కద – మరి గదేందో ఎయ్యనియ్యరాదూ సూద్దాం.

**1. ప్రేక్ష :** ఏందీడేసేది? మనకేం పనిలేదనుకున్నాడా?... నీకంత పన్లేకపోతే నువ్వు సూడవయ్యా – నేపోతున్నా...

**2. ప్రేక్ష :** అరె నీయమ్మ. దిమాఖ్‌గిట్ల ఖరాబైందా... పరేషాన్ చేస్తున్నావ్? ఏందివయా.

**1. ప్రేక్ష :** ఏందిరా కూసినావ్?

**2. ప్రేక్ష :** నేనేమన్నా భయ్?

**1. ప్రేక్ష :** నన్ను నీయమ్మ అని బూతులు తిడతావురా నువ్వు?

**2. ప్రేక్ష :** నేనేడ తిట్నాభయ్...నే తిట్లే!

**1. ప్రేక్ష :** మాట మారిస్తే చంపుతా!... నువ్వు తిట్టావు.

**2. ప్రేక్ష :** అరె ! తిట్టలేదంటే సమజైత లేదా?

**1. ప్రేక్ష :** (నటుడి తో) నువ్వు చెప్పవయ్యా! ఈడు నన్ను 'నీయమ్మ' అని తిట్టలేదూ?

**నటు :** లేదులే అన్నా, ఊర్కే ఎందుకు కోప్పడతావ్?... ఏదో ఊతపదంగా అన్నాడు.

**1. ప్రేక్ష :** ఏందీ ! ఊతపదమా!... భలే వున్నావయ్యా నువ్వు... ఇదిగో పెద్దాయనా, నువ్వు చెప్పు. ఈడు నన్ను తిట్టాడా లేదా!

**2. నటు :** నీయమ్మకడుపు బంగారంగానూ అన్నట్లున్నాడయ్యా... అది తిట్టుకాదు దీవెన.

**1. ప్రేక్ష :** ఏందీ...దీవెనా... బాగుందయ్యా, సానా బాగుంది.. ఆడు ఆమైన నన్ను పట్టుకుని బూతులు తిడతావుంటే ఈయనకేమో ఊతపదంగానూ, నీకేమో దీవెనగానూ ఇనపడిందా... అవున్లే, నాటకం సూణ్ణీకి వచ్చిన ఎర్రినా కొడుకుని గదా! మా అమ్మల్నీ అక్కల్నీ తిట్టండీ, దేవెలనుకుంటాం... ఎట్టాగూ డైలాగుల్లే వంటున్నాడుగా... ఇవే డైలాగులనుకుంటాం... తిట్టండి..

**2. ప్రేక్ష :** అన్నా ! నీకాల్మొకుతా! నే నిన్ను తిట్టలేదే... చెమించుకోయ్...ఇదుగో డైరెక్టరూ... నువ్వు నాటకం సాలూ చేయవయ్యా త్వరగా... నువ్వు పదన్నా...

(ప్రేక్షకులు కిందికి వెళ్ళారు)

**ప్రయోక్త :** చూశారా? అతనన్న దాంట్లో రెండు మాటలు సరిగా వినబడక పోతేనే తలా ఒకటి ఊహించి ఎంత గందరగోళం చేశారో... ఇప్పటికైనా అర్థం అయిందా... శబ్దం వినబడకపోతే సన్నివేశం ఊహించడం ఎంత కష్టమో... appearances are deceptive అన్నారు. మనం చూసేదంతా నిజంకాదు, అలాగే వింటున్నదంతా కూడా నిజం కాకపోవచ్చు. యద్భావం తద్భవతి అంటారు. మనం మానసిక పరిస్థితినిబట్టి కనిపించే దృశ్యాన్ని, వినిపించే శబ్దాన్ని మనకు తగినట్లు అన్వయించుకుంటాం... మనకు తోచిన అర్థం చెప్పుకుంటాం. ఉదాహరణకి ఒక భావుకుడికి ఆకాశంలోని చందమామ అరవిరిసిన కలువపూవులా అనిపిస్తే, అదే చందమామ ఓ తిండిపోతుకి ఏ ఇడ్లీలాగానో పూరీలాగానో అనిపించవచ్చు. అంతెందుకు, ఒక్కసారి ఆకాశంవైపు చూడండి. ఎన్నో మబ్బులు కనిపిస్తాయి. ఆ మబ్బుల్ని చూస్తుంటే ఎన్నో ఆకారాలు, ఎన్నో బొమ్మలుగా కనిపిస్తాయి. అవి ఏమిటీ అనడిగితే ఎవరికి తోచింది వాళ్ళు చెప్తారు.

మా నాటకం కూడా మబ్బుల్లో బొమ్మే. ఆ బొమ్మను చూసి మీకేం అర్థం అయిందో, ఆ సన్నివేశం గురించి మీరెలా ఊహించుకున్నారో చెప్పండి...

కరెక్ట్‌గా చెప్పగలిగినవాళ్ళకు మంచి బహుమానం ఉంటుంది. OK frieds...Good luck. (ప్రయోక్త లోపలికి వెళ్ళాడు...)

(పాత్రధారులు డైలాగుల్లేకుండా మైమ్ సీన్ ప్రదర్శించారు)

(సీన్ మధ్యలో 1. ప్రేక్షకుడు హడావిడిగా వచ్చాడు)

**1. ప్రేక్ష :** బాగుందమ్మా ! సానా బాగుంది... మీ ప్రదర్శన సానా బాగుంది (ప్రయోక్త చికాకుగా వచ్చాడు)

**ప్రయో :** ఏంటిసార్ ఇది? నాటకం మధ్యలో వచ్చి ఆపుతారేంటి?

**1. ప్రేక్ష :** చూసింది చాల్లేవయ్యా ! ఇంతోటి నాటకం మొత్తం చూస్తేగానీ చెప్పలేమా ఏంది?

**ప్రయో :** సార్, నాటకం మొత్తం చూశాక చెప్పండి సార్... ఇంకా వుంది.

**1. ప్రేక్ష :** చాలుచాల్లేవయ్యా! పాతకుర్చీకి రంగేసి, ఇది విక్రమార్కుడి సింహాసనం అన్నాడట వెనకటికి నీలాటోడే... ఇట్టాటి కథలు భూమి పుట్టిన్నటి నుంచీ వున్నాయి. దీనికో పెద్ద క్విజ్ ప్రోగ్రాం... మొత్తం నాటకం సూడ్డం... చూసినవరకూ చాలు ఇదేందో చెప్పడానికి

**ప్రయో :** అంటే ఈ సన్నివేశం ఏమిటో మీరు చెప్పగలరా?

**1. ప్రేక్ష :** యోవ్! నేనూ చిన్నపుడే పుట్టినోడిని. ఇంతప్పటినుంచీ నాటకాలు సూత్తానే వున్నా... నన్ను తక్కువ అంచనా ఎయ్యబాక, నాటకం మొదటి సీను చూస్తేచాలు క్లైమాక్స్ చెప్పే కెపాసిటి వున్నోడిని.

**ప్రయో :** మీలాంటి ప్రేక్షకులే సార్ ఈ రోజు నాటక రంగానికి కావలసింది. మీరు చూసిన వరకూ ఈ సన్నివేశం ఏమిటంటారు?

**1. ప్రేక్ష :** నేనేందయ్యా! ఆ ఎనక వరుసలో కూచున్న చిన్న పిల్లోడిని అడిగినా చెప్తాడు – ఇది వరకట్నం సీను.

**ప్రయో :** వరకట్నమా?

**1. ప్రేక్ష :** ఇట్టా ఆడపిల్లకాయల్ని తగలబెట్టే నాటకాలు ఎన్నో చూసినా, అన్నింట్లో ఒకటే కథ... వరకట్నమే.

**2. ప్రేక్ష :** (వచ్చాడు) ఏందివయ్యా, దిమాఖేమన్నా ఖరాబైందా?... ఇది వరకట్నం కాదు భయ్

**1. ప్రేక్ష :** కాదంటావేంది... ఇదీ వరకట్నమే... ఆయమ్మ అత్త. ఆయన మామ. ఈ పిలగాడు మొగుడు. ఆ పిల్ల కోడలు. కట్నం తేలేదని పాపం ఆ పిల్లని కిరసనాయిల్ పోసి చంపుతుండారు.

**2. ప్రేక్ష :** ఆరేభయ్! సిన్నప్పటిసంది నాటకాలు సూసీ సూసీ నీ భేజా కరాబైంది. దునియాలో ఆడోల్లని సంపనీకి కట్నం సమస్యలు తప్ప ఇంకోటి లేవా?

**1. ప్రేక్ష :** చాల్లేవయ్యా భలే చెప్తున్నావు. కట్నం తేలేదని ఆడోల్లని కిరసనాయిల్ పోసి చంపేటోల్లని సానామందిని చూసినా...

**2. ప్రేక్ష :** అన్నా, నీకాల్మొక్కుతాన్... నువ్వు దునియా మొత్తం చూసినట్లు లేవే... ఆడోల్లని సంపనీకి కట్నం మాత్రమే గాదే ఇంకా సానా సమస్యలున్నాయి.

**1. ప్రేక్ష :** అట్నా !... అయితే ఇది వరట్నం కాకపోతే ఏందోచెప్పు.

**2. ప్రేక్ష :** ఆస్తి సమస్య

**ప్రయో :** ఆస్తి సమస్యా !

**2. ప్రేక్ష :** అవును ఈ మధ్య ప్రభుత్వం వాళ్ళు ఆడోళ్ళకి ఆస్తిలో హక్కుందని చట్టం చేసినారు గద. ఆ సమస్యన్న మాట ఇది.

**1. ప్రేక్ష :** తెలివుండే మాట్లాడుతున్నావా! ఆస్తి సమస్య అయితే ఆ పిల్లనెందుకయ్యా చంపుతారు?

**2. ప్రేక్ష :** ఆడ్నే వుందన్నా లిటిగేషను, ఇట్టాటిది మా ఊళ్ళో జరిగింది. నా కల్లారా చూసినా భయ్.

**1. ప్రేక్ష :** ఏందీ మీ ఊళ్ళో జరిగింది!... నువ్వు చూసినావా...ఎట్టా? అయితే సెప్పు.

**2. ప్రేక్ష :** నీకెందుకు చెప్తా... అల్లతోనే ఆడిపిస్తాచూడు..

ఇదిగో డైరెక్టరూ. ఆల్లనిట్ట రమ్మను – కథ చెప్తా

**ప్రయో :** (నటీనటులతో) ఈయనేదో చెప్తాడంట. ఆ విధంగా నటించండి.

**1. నటు :** ఆయన చెప్పినట్లు చేయడమేంటి?... డైరెక్టర్ నువ్వా... ఆయనా?

**2. ప్రేక్ష :** ఇద్గోభయ్. ఈ సీన్ వరకూ నేనే డైరెక్టర్ని. ఇద్గో డైరెక్టరూ! అంతగైతే సినిమా డైరెక్షన్ తీరున, కథా మాటలు, స్క్రీన్‌ప్లే, డైరెక్షనూ అంతా నీ పేరు ఏసుకో... ఈ సీన్ మాత్రం నేనే డైరెక్ట్ చేస్తా.

**ప్రయో :** OK... (నటులతో) చూడండీ... ఆయన చెప్పినట్లు చేయండి.

**1. నటి :** ఇదేంటి సార్... డైలాగులు లేకుండా నాటకం ఆడాలన్నారు... మరిపుడు డైలాగులతో వేయమంటే ఎలా సార్ !

**ప్రయో :** దాందేముందమ్మా... సన్నివేశం ఆయన చెప్తాడు.. సందర్భానికి తగినట్లు మీ ఇష్టం వచ్చిన డైలాగులు extempore గా చెప్పండి.

**2. నటి :** భలే చెప్పారు సార్ మీరు... ఇరవైరోజులు రిహార్సల్స్ చేసిన నాటకాల్లోనే

డైలాగులు దూడలేస్తూంటాం. అలాంటిది ఇప్పటికిప్పుడు మా అంతట మేమే డైలాగులు చెప్పాలంటే తమాషానా సార్ !

**1. నటి :** ఇదంతా నావల్లకాదులెండి సార్ !

**ప్రయో :** నీవల్ల అవుతుందో లేదో చెప్పాల్సింది నేను...నాకు తెలుసు నువ్వు చేయగలవని. ఆ నమ్మకం నాకుంది. ఎందుకంటే, నువ్వు రంగస్థల నటివి. మొన్నేదో సినిమాలో రెండు డైలాగుల వేషం దొరికింది కదా అని పెద్ద star అయినట్లు పోజ్‌కొట్టకు, తప్పు. ఆయనేదో చెప్తున్నాడు. చేయడానికి ప్రయత్నించండి... ఇది మన సమాజానికి ప్రిస్టేజ్ క్వొశ్చన్...

**1. నటి :** (గొణుగుతూ) ఒక నాటకం వేయడానికి కిరాయిచ్చి రెండోది కూడా వేయమంటే ఎలా?

**2. ప్రేక్ష :** తల్లీ.. నీ కిరికిరంతా కిరాయి గురించా... ఆ కిరాయి నేనిస్తాలే... ఇది నా Prestige Question నేను చెప్పింది చేయాలంతే !

**ప్రయో :** మీకేగాదు సార్ – మా సంస్థకూ పరువు ప్రతిష్ఠల సమస్యే...మీరు చెప్పండి.

(నటీనటులకు రెండవ ప్రేక్షకుడు సూచనలు ఇచ్చాడు)

(నటీనటులు రెడీ అయ్యారు. ప్రయోక్త, 2. ప్రేక్షకుడు పక్కకు తొలిగారు–సీన్ మొదలైంది)

(యువకుడు ఫోన్ వద్ద కూర్చుని గాబరా పడుతుంటాడు. చాలా కంగారుగా వుంటాడు. యువతి మధ్యనున్న flower vase దగ్గర నుంచొని దిక్కులు చూస్తూంటుంది. ఎడమ వైపున కుర్చీలో ఆమె కూర్చుని వుంటుంది..)

**యువ :** ఏమైందో ఏమో, నాకు చాలా టెన్షన్‌గా వుంది.

**ఆమె :** దరిద్రపు ముఖం మాటవినదుగా, టెన్షన్ తప్పదు మరి !

**యువతి :** మీరెంత ఇదైనా నాకు మంచే జరుగుతుంది.

**యువకు :** మూడు సంవత్సరాల నుంచీ కేసు నలుగుతూనే వుందిగా. ఇదంతా నీవల్లే (యువతిని కొట్టడానికి వస్తాడు–Phone ring అవుతుంది)

(Phone ఎత్తగానే line cut అవుతుంది)

**ఆమె :** ఏమండీ... ఏమండీ !

(అతడు గదిలోంచి వచ్చాడు)

**అతడు :** ఏమిటీ?

**ఆమె :** మీరొకసారి లాయర్ సుధాకర్ దగ్గరికి వెళ్ళిరండి.

**అతను** : వెళ్ళి?

**ఆమె** : జడ్జిమెంట్ ఏమైందో కనుక్కొని రండి

**అతను** : అమ్మాయి కేసు విషయమేనా?

**ఆమె** : ఆ...మూడేళ్ళుగా వాయిదాలే తప్ప జడ్జిమెంట్ లేదుగా–అందుకని...

**అతడు** : వాయిదాలు పడితేనేగా లాయర్లకి డబ్బు...

**యువకు** : ఈ రోజు జడ్జిమెంట్... అదేమిచ్చారో తెలుసుకోవాలి. నాకు చాలా టెన్షన్‌గా వుంది... వెళ్ళు... లాయర్‌ని కలసి Phone చేసి నాతో మాట్లాడు.

**అతడు** : నువ్విక్కడ ఇంత కంగారు పడేకన్నా... నువ్వే వెళ్ళి కనుక్కొని రావచ్చుగా...

**యువకు** : లేదు – కేసు నాకు ఫర్‌గా రాలేదు అన్నాడనుకో – నేను తట్టుకోలేను – ఆ లాయర్‌ని చంపేస్తాను.

**యువతి** : జడ్జిమెంట్ నాకు ఫర్‌గా వస్తుంది.

**యువకు** : అప్పుడు నిన్ను బ్రతకనివ్వను

**ఆమె** : (అతడితో) ఏంటింకా నిలబడ్డారు, వెళ్ళండి.

**అతడు** : నేను వెళ్ళను

**ఆమె** : ఏం?

**అతడు** : లేకపోతే ఏంటే! జడ్జిమెంట్ వాడికి ఫర్‌గా రాకపోతే లాయర్‌ని చంపేస్తానంటున్నాడు. అమ్మాయికి ఫర్‌గా వస్తే దాన్ని చంపేస్తానంటున్నాడు. ఇంక జడ్జిమెంట్ కాపీ తీసుకొస్తే నన్నేం చేస్తాడో. అందుకే వెళ్ళను.

**యువకు** : (వందనోటు తీసి చూపిస్తూ) ఇదేమిటి?

**అతడు** : వందరూపాయల నోటు

**యువకు** : దీన్ని రెండు యాభైలుగా మార్చుకోవచ్చు. పది పదులుగానూ మార్చుకోవచ్చు. అది నీ తెలివిపైన, అవసరంపైన ఆధారపడి వుంటుంది. కోర్టు ఇచ్చే జడ్జిమెంటు కూడా అంతే – (Phone ring.) చూడు లాయరేమో!

**ఆమె** : (రిసీవర్ ఎత్తి) Hello... లాయర్‌గారా... ఆఁ... ఫైనల్ కాలేదా... మీరు కోర్టుకు వెళ్ళారా... అలాగా... జడ్జిమెంట్ ఇవ్వలేదన్నమాట అలాగే...వుంటాను.

**యువకు** : ఏమంటాడు?

**ఆమె** : నువ్వే గెలుస్తావంటాడు... వాయిదా వేశారట... వచ్చేవారం అవుతుందట.

**యువకు** : (యువతిని కొట్టబోయాడు) దీన్నీ...

**అతడు** : ఒరేయ్....(అడ్డుకుంటాడు)

**యువ** : (అతడితో) మా అమ్మను నమ్మించి రెండో పెళ్ళి చేసుకుని మమ్మల్ని అన్యాయం చేశావు నాన్నా... దుర్మార్గుడా... జడ్జిమెంట్ దానికి ఫేవర్‌గా వస్తే నాకు మిగిలేదెంతో తెలుసా.... ఈ కోటిరూపాయల ఆస్తిలో కేవలం పది లక్షలు...

**యువతి** : నా వాటా నాకిస్తే కోర్టు కెందుకు వెళతాను?

**యువకు** : చాల్లే నోర్ముయ్... పోనీలే అని వూరుకుంటున్నాను. లేకపోతే (యువతిని వెనక్కి తోశాడు)

**అతడు** : అదేమీ పరాయిది కాదురా... నీతోడబుట్టిన అక్కరా!

**ఆమె** : మీరేంటి మధ్యలో! అదెలాగూ కోర్టులో గెలవదు... ఒక్క పైసా కూడా రాదు... రాజీపడమని చెప్పండి. పది లక్షలు ఇస్తాము...

**యువతి** : రాజీపడాలా... తప్పకుండా రాజీపడతాను-సగం వాటా ఇస్తే !

**యువకు** : ఏంటీ?... సగం వాటా కావాలా?... నీకిలా లాభం లేదే... రౌడీలను పిలుస్తాను (Phone ఎత్తాడు).

**అతడు** : (రిసీవర్ లాక్కుని) ఒరేయ్! స్థిమితంగా ఆలోచించరా...

**యువకు** : అది కేసు గెలిచిందంటే నేను తట్టుకోలేను... దాన్ని చంపి తీరుతాను... (Phone లాక్కున్నాడు)

**అతడు** : (ఆపి) దాన్నెంతో బ్రతిమాలి చూశానురా - తమ్ముడితో తగవెందుకమ్మా అన్నాను... కోర్టు జడ్జిమెంట్ దానికి ఫేవర్‌గా వచ్చినపుడు ఆలోచిద్దాం... అంతవరకూ తొందరపడకు... నా మాట వినరా.

**యువతి** : నాన్నా...వాడినెందుకు బతిమాలుతావు? వాడేం చేస్తాడో చేసుకోమను...అదీ చూస్తాను (లోపలికి వెళుతుంది)

**అతడు** : (యువకుని వైపు కోపంగా చూసి.. ఆమె వైపు చూస్తూ) ఇప్పుడే వస్తాను...

**ఆమె** : ఎక్కడికి?

**అతడు** : లాయర్ దగ్గరికి

**ఆమె** : మీరేం వెళ్ళనవసరం లేదు. లాయర్ నాతో చెప్పాడు కేసు వాయిదా పడిందని.

**అతడు** : అదే కనుక్కొని వస్తాను (వెళ్ళిపోయాడు)

**ఆమె** : కొంప మునుగుతుంది ఈ మనిషి లాయర్‌ని కలిస్తే...

**యువకు** : కలిస్తే కలవనీ (ఆమె Phone తీసింది) ఎవరికి ఫోను?

**ఆమె** : లాయర్‌కి...

**యువకు :** ఎందుకూ...?

**ఆమె :** (Dial చేసి) హలో... హలో... దిక్కుమాలిన ఫోను పీకల మీదకు వచ్చినపుడే సరిగ్గా పనిచేయదు... ఈయన లాయర్ని కలిస్తే నిజం తెలిసిపోతుంది...

**యువకు :** నిజమేమిటి?

**ఆమె :** ఇందాక నీతో చెప్పింది అబద్ధం... ఆ రాక్షసికే జడ్జిమెంటు ఫర్‌గా వచ్చిందట... నువ్వు ఓడిపోయావట.

**యువకు :** నిజమా?

**ఆమె :** అవును, ఆడవాళ్ళకు ఆస్తి హక్కు వచ్చిందట. ఎంత వాదించినా లాభం లేకపోయిందట. అది వింటుందని నీతో అబద్ధం చెప్పాను.

**యువకు :** (కోపంగా) దీన్నీ... నా మీదే కోర్టుకు వెళ్తుందా అది... ఆస్తిలో సగభాగం కాజేసుకుని పోతుందా... అసలు నీ మాట విన్నందుకు నా చెప్పు తీసి కొట్టుకోవాలి.

**ఆమె :** నా కడుపున పుట్టినందుకు ఆస్తి నీకే దక్కుతుందనుకున్నాను. మీ నాన్న సంగతి నీకు తెలుసు. మనమీద ప్రేమ అయితే ఒలకబోస్తాడు గానీ అతని ప్రేమంతా కూతురు మీదే. వాళ్ళిద్దరూ ఏకమైతే మనల్ని ఇంట్లోంచి పొమ్మంటారు. అందుకే వాళ్ళిద్దరి దగ్గరా నిజం దాచాను.

**యువకు :** ఎన్నాళ్ళు దాచగలం?

**ఆమె :** ఎన్నాళ్ళో అక్కర్లేదు – ఇప్పుడే దానికి నిజం చెప్తాం. దానికి చెప్పేముందు మనం ఏదైనా ఆలోచించాలి.

**యువకు :** ఏంటి?

**ఆమె :** ఏముందీ... కోర్టు ఎంతిచ్చిందో కనుక్కోవాలి... అది నీకు అమ్మేసినట్లు రాసివ్వాలి.. సగం ఆస్తి నీది అని కోర్టు అన్నాదిగానీ ఎవరికీ అమ్ముకోవద్దని చెప్పలేదుగా?

**యువకు :** అంటే?

**ఆమె :** అంటే ఏముందీ? అది పత్రాల మీద సంతకం పెడితేచాలు. పత్రాలు దానివి, పైసలు మనవి. (చెవిలో చెప్పి) అది నువ్వు ఒప్పించగలిగితే...

**యువకు :** అది ఒప్పుకుంటుందా?

**ఆమె :** ఒప్పుకోకపోతే ఒప్పించాలి... అదీ మీ నాన్న రాకముందే జరగాలి.

**యువకు :** అమ్మా! అది ఒప్పుకుంటే ఆస్తి మొత్తం నాదైపోతుందా?

**అతను** : (బయటినుండి) ఒసేయ్...ఒసేయ్...

**ఆమె** : అదిగో మీ నాన్న వస్తున్నారు. లోపలికెళ్ళి దాంతో మంచిగా మాట్లాడి ఒప్పించు. నేను మీ నాన్నని ఒప్పిస్తాను. (యువకుడు లోనికి వెళ్ళాడు)

**అతను** : (వస్తూ) ఆ లాయర్ ఏం చెప్పాడో సరిగ్గా విన్నావా?... చూడు యిందులో ఏముందో!

**ఆమె** : అందులో ఏముందో నాకు తెలుసు, ఇంకా చూసేదేంటి?

**అతను** : తెలుసా?

**ఆమె** : అవును

**అతను** : తెలిసీ అబద్ధం ఎందుకు చెప్పావ్?

**ఆమె** : మిమ్మల్ని తమాషా పట్టించాలని!

**అతను** : ఏంటా వెధవ మాటలు?

**ఆమె** : వెధవమాటలే... ఇలారండి (కూర్చోపెట్టి చెవిలో చెప్పింది)

**అతను** : (లాగికొట్టాడు) అడ్డంగా నరుకుతా ఏమనుకున్నావో! దాని ఆస్తి వాడికమ్మేసినట్లు రాసివ్వాలా! ఆ మాటనడానికి నీకు నోరెలా వచ్చిందే, అదే నీ సొంత కూతురైతే అనే దానివా!

**ఆమె** : పనికిమాలిన సన్నాసీ... ఆడపిల్లలకిచ్చేది కట్నాలు కానుకలేగానీ ఆస్తిలో హక్కులు కాదు... కూతురు మీద అంత ప్రేమున్నవాడివి నన్నెందుకు రెండో పెళ్ళి చేసుకున్నావు? పోనీ వాడు నీకు పుట్టలేదని ఒక్కమాట చెప్పు. ఈ ఇంట్లో వుంటే చెప్పుతీసి కొట్టు. ఏ తండ్రీ ఏ కొడుక్కి ఇలా అన్యాయం చేయడయ్యా!

**అతను** : ఇంత అన్యాయం పని వద్దే.

**ఆమె** : ఇందులో న్యాయం అన్యాయం అంటూ లేదు. డబ్బుంటే న్యాయం, లేకుంటే అన్యాయం. ఏం కాదా?... ఈ ఆస్తిని చూసే కదా నేను నిన్ను రెండోపెళ్ళి చేసుకున్నది. కోర్టుకెళ్ళి ఈ ఆస్తి దక్కకుండా చేస్తుందా... అది చూసి నేనూరుకుంటానా? నేను చెప్పినట్లు అది వినకపోతే కనీసం ఆనవాలు దొరక్కుండా దాన్ని చంపించేసి చేతులు దులుపుకుంటాను... తెల్సిందా?

**అతడు** : ఛీ... (లోపలికి వెళతాడు. ఆమె వెనకాలే వెళ్తుంది) (యువతీ యువకులు లోనుంచి వస్తారు)

**యువకు** : అక్కా, ప్లీజ్... ఒప్పుకోవా... మా మంచి అక్కవు కదూ, ప్లీజ్...

**యువతి** : ఏంటీ, ఎప్పుడూ లేనిది అంత ప్రేమగా అక్కా అని పిలుస్తున్నావ్. ఈ అక్కంటే అంతిష్టమా?

**యువకు :** అవును, కొందరికి అమ్మంటే యిష్టం. కొందరికి నాన్నంటే యిష్టం... నాకు మాత్రం అక్క. అక్కంటేనే ఇష్టం. ఇదంతా ఆస్తికోసం అనుకోకు. నన్ను నీ సొంత తమ్ముడనుకొని ఆస్తిలో నీ వాటా నాకు అమ్మేసినట్లు రాసివ్వాలి. దట్సాల్.

**అతడు :** (వస్తూ) ఇది అన్యాయమే. ఈ అన్యాయం నేను చేయలేను.

**ఆమె :** వాడు నీ కొడుకు కాదా... నీకు పుట్టలేదని చెప్పు నేను అడగను. ఎవడికి పుట్టాడో చెప్పు, వాడినే అడుగుతాను... న్యాయం చేయమని.

**యువతి :** మీరెంత ప్రయత్నించినా ఆస్తి మాత్రం వాడికి రాసివ్వను.

**ఆమె :** ఇందులో నీదేముందే పొగరుమోతుదానా! మర్యాదగా దస్తావేజుల మీద సంతకం పెట్టు, లేకుంటే చంపుతాను.

**యువతి :** ఆహా! అంతవరకూ వచ్చారా?

**ఆవె :** తప్పదు మరి... సంతకం పెట్టు... ఏ హానీ లేకుండా వదిలేస్తాం...

**యువతి :** నువ్వెంత భయపెట్టినా సంతకం పెట్టను

**ఆమె :** పెట్టకపోతే మీ నాన్నను ఇందులో ఇరికిస్తాం... ఎలాగంటావా? ఎవడితోనో నీకు సంబంధం వుందంటాం... వాడితో లేచిపోయావంటాం. అది తెలిసి మీ నాన్న నిన్ను కొట్టిచంపాడంటాం... ఇప్పుడేమంటావు?

**యువతి :** నోరుంది కదా అని ఇష్టం వచ్చినట్లు మాట్లాడకండి... (వెళ్ళబోతుంటే ఆమె అడ్డుతగిలింది) అడ్డులే...

**యువకు :** లేవదు.. అది లేవాలంటే నువ్వు సంతకం పెట్టాలి. లేదా ప్రాణాలతో మిగలవు.

**యువతి :** నేను చావనైనా ఛస్తాను గానీ సంతకం మాత్రం పెట్టను.

**యువకు :** ఒసేయ్... నన్ను విసిగించకు, అక్కవని చూడకుండా పదిమందిని తెచ్చి మర్డర్ చెయ్యిస్తాను.

**అతడు :** ఒరేయ్, ఒరేయ్... ఇది ధర్మం కాదురా!

**ఆమె :** ఇదిగో, మేం చెప్పినట్లు దాంతో ఆస్తి రాయించకపోయావో... దాన్ని మర్డర్ చేసి ఆ నేరం నీ మీద వేసి జైల్లో తోయిస్తాం. బయటికి రాలేక అక్కడే మగ్గి ఛస్తావ్...

**అతడు :** అమ్మా, వీళ్ళు మనుష్యుల రూపంలో వున్న రాక్షసులమ్మా ! నిన్ను చంపక మానరు. ఎక్కడికన్నా వెళ్ళిపోమ్మా....

(యువతి వెళ్ళబోతుంది)

**ఆమె** : ఎక్కడికే... (యువతి విదిలించుకు వెళ్ళబోయింది)

**యువకు** : ఆగు... ఎక్కడికెళ్తావ్...?

**యువతి** : నాకెక్కడ యిష్టమైతే అక్కడికి... (లోనికి వెళ్తుంది)

**ఆమె** : అది బయటికి పోయేట్లుంది

**యువకు** : పోతేపోనీ... ఆస్తి మొత్తం నేనే అనుభవిస్తాను

**ఆమె** : పోయింది వూరికే వుంటుందా? మనం చంపించబోయామని వూరందరికీ టాం, టాం వేసి మరీ చెప్తుంది... అదీగాక మీ నాన్న బతికుండగా ఈ ఆస్తిని అనుభవించనిస్తాడ్రా?

**యువకు** : వాడ్నికూడా చంపుతా!

**ఆమె** : చంపాల్సింది మీ నాన్ననుకాదు - దాన్ని... అది ఇంట్లోంచి కాలు బైటపెట్టిందో. మనం జైలు కెళ్ళినట్లే... మీ నాన్న కూడా దాని పక్షమే సాక్ష్యం చెప్తాడు.

**యువకు** : నిజమే !

(యువతి సూట్ కేసుతో వస్తుంది - యువతిని ఆమె పట్టుకుంది)

**ఆమె** : ఎక్కడికే బయలుదేరావ్? ఇంట్లో పడుండు. (కొట్టింది)

**అతడు** : (ఆమెను లాగి) అమ్మాయినేమన్నా అన్నావో - నరికి పోగులు పెడ్తాను... నువ్వెళ్ళమ్మా...

**యువకు** : అడుగు ముందుకేస్తే అడ్డంగా నరుకుతా!

**అతడు** : నిన్నెవరూ ఏం చేయలేరు నువ్వెళ్ళమ్మా !

(యువతి వెళ్ళబోయింది... యువకుడు జుట్టు పట్టుకుంటాడు. అతను విడిపించబోతాడు)

**ఆమె** : (అతన్ని పక్కకు లాగి) ఏమే, మా మాటంటే లెక్క లేకుండా పోయిందా? పద లోపలికి.

(యువతి రెక్కలు విరిచి పట్టుకుంటుంది... అతడు ఆమెను వెనకనుంచి పట్టుకుంటాడు. యువకుడు అతన్ని, యువతిని ఆమె చెరో పక్కకు లాగి కొట్టిపడేస్తారు)

**ఆమె** : ఇది బతికుండగా ఈ దరిద్రుడు మనమాట వినడు. దీన్ని చంపేద్దాం. నువ్వెళ్ళి అగ్గిపెట్టి కిరసనాయిల్ డబ్బా పట్రా... (యువకుడు లోనికి వెళ్ళి కిరసనాయిల్ డబ్బాతో వచ్చాడు)

**యువకు :** స్త్రీకి ఆస్తి హక్కు యివ్వాలంది చట్టం... కట్నకానుకలిస్తే చాలంది సాంప్రదాయం. సాంప్రదాయంకన్నా చట్టం ఎప్పుడూ బలహీనమైనదే. అలాంటి బలహీనమైనదాన్ని బలంగా పట్టుకున్న ఓ సోదరీమణీ... అందుకో నా ఆఖరి జోహార్... (కిరసనాయిల్ పోసి లైటర్ వెలిగించాడు)

(సడన్‌గా రెండవ ప్రేక్షకుడు stage మీదికి వచ్చాడు చప్పట్లు కొడుతూ)

**2. ప్రేక్ష :** సూపరో... సూపర్... అన్నా, జబర్దస్త్ చేసినావ్... సూపర్...

**1. ప్రేక్ష :** (వచ్చి). అంతా బాగుంది కానీ... కత మాత్రం ఇదిగాదయ్యా !

**2. ప్రేక్ష :** నీకు దిమాకేమన్నా రిపేరు కొచ్చిందా భయ్... కాదంటావ్...

**1. ప్రేక్ష :** కాదు... ఖచ్చితంగా ఇది ఆస్తి సమస్య కాదు... పిల్లల సమస్య

**ప్రయో :** (వచ్చి) పిల్లల సమస్యా...?

**1. ప్రేక్ష :** అవునండీ... పిల్లల సమస్యే...

**ప్రయో :** అంటే, ఇది ఆడవాళ్ళ ఆస్తి హక్కు సమస్య కాదంటారు !

**1. ప్రేక్ష :** ఎన్నిసార్లు చెప్పాలయ్యా కాదని. నేను చిన్నపుడే పుట్టినోడిని. ఇంతపుటి నుంచీ నాటకాలు చూస్తన్నా... ఇది పిల్లల సమస్య.

**2. ప్రేక్ష :** గదేందో చెప్పరాదూ?

**1. ప్రేక్ష :** నీకెందుకు చెప్తా? నువ్వేమన్నా నాకు చెప్పినావా... నేనూ వాళ్ళకే చెప్తా...

**2. ప్రేక్ష :** అయితే చెప్పుకో... (వెళ్ళిపోయాడు)

**1. ప్రేక్ష :** ఇదిగో డైరెక్టరూ... నేను కత చెప్తా... వాళ్ళను ఆడమను.

**యువకు :** ఏంటిసార్ ఇది? ఆయన చెప్పినట్లు చేయమన్నారు ఇందాక. ఇపుడు ఈయన చెప్పినట్లు చేయాలా?

**ప్రయో :** తప్పదు... మనం ఓ 'Quiz' పెట్టాం. దాన్ని ఎవరు ఎలా ఎంతవరకూ అర్థం చేసుకున్నారో తెలుసుకోవాలిగదా... మీరు చెప్పండి.

(1. ప్రేక్షకుడు నటీనటులకు సీన్ చెప్పాడు)

(మళ్ళీ scene మొదలైంది)

(యువకుడు Phone దగ్గర Tension పడుతున్నాడు)

**యువకు :** ఇంకా ఎంతసేపు అవుతుందో... నాకు టెన్షన్‌గా వుంది.

**ఆమె :** దరిద్రాన్ని మెడకు కట్టుకున్నావుగా, టెన్షన్ తప్పదు మరి !

**యువతి :** మీరేం ఇదవకండి, అంతా మంచే జరుగుతుంది.

**యువకు :** మూడేళ్ళ నుంచీ మంచి జరుగుతూనే వుందిగా... ఇదంతా నీవల్లే.

(కొట్టడానికి వెళ్ళాడు - Phone ring... రిసీవర్ ఎత్తగానే cut)

**ఆమె :** ఏమండీ... ఏమండీ!

(అతడు గదిలోకి వచ్చాడు)

**అతడు :** (వస్తూ) ఏమిటీ!

**ఆమె :** మీరోసారి డాక్టర్ సుధాకర్ దగ్గరికి వెళ్ళిరండి.

**అతడు :** వెళ్ళి?

**ఆమె :** రిపోర్ట్స్ ఇస్తానన్నాడు తీసుకురండి.

**అతడు :** ఏం, ఏమన్నా విశేషమా?

**ఆమె :** అఁ... అదొక్కటే తక్కువ. పెళ్ళయి మూడేళ్ళయినా పిల్లాపీచూ లేరుగా – అందుకని...

**అతను :** అబ్బా... పుట్టేవాళ్ళు పుట్టక మానరు లేవే...

**యువకు :** మానేశారు కదా ! ఎందుకు మానేశారో తెలుసుకుందామనే ఈ టెస్టులు చేయించుకున్నాం. నాకు చాలా టెన్షన్‌గా వుంది. వెళ్ళు... రిపోర్ట్స్ తీసుకున్న వెంటనే నాతో Phone లో మాట్లాడు.

**అతను :** ఇక్కడింత కంగారు పడేకన్నా... నువ్వే వెళ్లి తీసుకురావచ్చుగా

**యువకు :** లేదు... లోపం నాలో వుందన్నాడంటే నేను తట్టుకోలేను. ఆ డాక్టర్ని చంపేస్తాను.

**యువతి :** పోనీ, ఆ లోపం నాలో వుందనుకోండి.

**యువకు :** అపుడు నిన్నూ బ్రతకనివ్వను

**ఆమె :** (అతడితో) ఏం ఇంకా అలాగే నిలబడ్డారు...? వెళ్ళండి.

**అతను :** నేను వెళ్ళను.

**ఆమె :** ఏం?

**అతను :** లేకపోతే ఏంటిది? పిల్లలు పుట్టకపోవడానికి సవాలక్ష కారణాలుంటాయి. అదేంటో చెపితే డాక్టర్ని చంపేస్తానంటాడు... లేదంటే పెళ్ళాన్ని చంపేస్తానంటాడు. ఇక ఆ రిపోర్ట్స్ తెస్తే నన్నేం చేస్తాడో. అందుకే నేను వెళ్ళను.

**యువకు :** (వందనోటు తీసి చూపిస్తూ) ఇదేంటిది!

**అతడు :** వందరూపాయల నోటు.

**యువకు :** దీన్ని నీ నెత్తి మీద పెట్టి వేలం వేస్తే ఒక్కరూపాయక్కూడా నిన్నెవరూ కొనరు అదే నీ విలువ... అలాంటిది ఈ రోజు కార్లు, బంగళాలు, నౌకర్లు ఎలా enjoy చేస్తున్నావ్... ఇవన్నీ నీ బాబువా (Phone మ్రోగింది) చూడు... డాక్టరేమో?

**ఆమె :** (Phone లో) హలో... డాక్టర్‌గారా... అలాగా... అస్సలు బాగా లేదా... మీరు బాగా చూశారా... అన్ని టెస్ట్‌లు చేశారా... సరే... ఉంటానండీ...

**యువకు :** ఏమంటాడు?

**ఆమె :** నీకంతా సవ్యంగా వుందట... దానికే గర్భసంచి బాగులేదట. పిల్లలు పుట్టడం కష్టం అంటున్నాడు.

**యువకు :** దీన్నీ... (కొట్టబోయాడు)

**అతడు :** ఒరేయ్. (అడ్డుకుంటాడు)

**యువకు :** ఎహె! నువ్వేంటి మధ్యలో. నాకు పిల్లలు పుట్టిన తర్వాత ఈ ఆస్తి నాకు చెందాలని విల్లు రాశాడు మా నాన్న... దుర్మార్గుడు... నాకు పిల్లలు పుట్టకపోతే మిగిలేదెంతో తెలుసా ఈ కోటిరూపాయల ఆస్తిలో కేవలం పది లక్షలు.

**యువతి :** పది లక్షలా... లక్షణంగా బతికితే పది లక్షలు చాలు.

**యువకు :** చాల్లే నోర్మూయ్ నాకిపుడు అప్పులే యాభైలక్షలున్నాయి. ఎవరు తీరుస్తారు? (యువతిని వెనక్కి తోశాడు)

**అతడు :** అమ్మాయిని ఏమీ అనకురా... నువ్వు కట్టుకున్న భార్యరా!

**ఆమె :** మీరెందుకు మధ్యలో! దానికెలాగూ పిల్లలు పుట్టరు. ఈ ఆస్తి వాడికి దక్కదు. దానికి విడాకులిచ్చేస్తే సమస్య పరిష్కారం అవుతుంది.

**యువతి :** దయచేసి అలాంటి సలహాలివ్వకండి.

**యువకు :** Correct–బాగా గుర్తుచేశావు వదినా... పిల్లలు పుట్టకపోతే విడాకులు యిచ్చేయ వచ్చేమో లాయర్‌ని కనుక్కుంటాను... (Phone ఎత్తాడు)

**అతడు :** (రిసీవర్ లాక్కొని) ఒరేయ్. స్థిమితంగా ఆలోచించరా...!

**యువకు :** ఈ గొడ్డుమోతుదాన్ని నెత్తిన పెట్టుకుని... ఎన్నాళ్ళు ఊరేగాలి? (ఫోను లాక్కున్నాడు)

**అతడు :** ఈ రోజుల్లో చాలా రకాల మందులు వచ్చాయిరా... ఏదో ఒక మందు పనిచేయక మానదు. ఏ డాక్టర్ వల్లా కాకపోతే అపుడు ఆలోచిద్దాం–అంతవరకూ తొందరపడకు.

**యువతి :** ఆయన్ని ఆపకండి బావగారూ! ఆయనకేది ఆనందమో అదే నాకు సంతోషం. (లోపలికి వెళుతుంది)

**అతడు :** (యువకునివైపు కోపంగా చూసి, ఆమెవైపు చూస్తూ) ఇప్పుడే వస్తాను.

**ఆమె :** ఎక్కడికీ?

**అతడు :** డాక్టర్ దగ్గరికి.

**ఆమె :** మీరేం వెళ్ళక్కర్లేదు, డాక్టర్ నాతో చెప్పాడుగా – ఖచ్చితంగా దానికి పిల్లలు పుట్టరని.

**అతడు :** అదే కనుక్కొని వస్తాను. (వెళ్ళాడు)

**ఆమె :** కొంపమునుగుతుంది ఈయన డాక్టర్ని కలిస్తే.

**యువకు :** కలిస్తే కలవనీ (ఆమె Phone తీసింది) ఎవరికి ఫోను?

**ఆమె :** డాక్టర్ గారికి.

**యువకు :** ఎందుకూ?

**ఆమె :** హలో...హలో... దిక్కుమాలిన ఫోను పీకల మీదికి వచ్చినపుడే సరిగ్గా పనిచేసి చావదు... ఆ రిపోర్ట్ ఆయన చేతిలో పడితే నిజం తెలిసిపోతుంది.

**యువకు :** నిజమేంటి?

**ఆమె :** ఇందాక నీతో చెప్పింది అబద్ధం... ఆ రాక్షసికి అంతా బాగానే వుందట. లోపం నీలోనే వుందన్నాడు.

**యువ :** నిజమా?

**ఆమె :** అవును. సెల్స్‌లో కదలికలు లేవట... ఎన్ని మందులు వాడినా బాగు కాదన్నారు. ఆ విషయం వింటే నువ్వు తట్టుకోలేవని అబద్ధం చెప్పాను.

**యువకు :** (కోపంగా) నిన్నూ... ఛీ... మీరంతా నన్నెందుకు హింసిస్తున్నారు? మిమ్మల్ని తెచ్చి ఇంట్లో పెట్టుకున్నందుకు నన్ను చెప్పుతో కొట్టుకోవాలి.

**ఆమె :** నీ ఉప్పు తిన్నందుకు నీకు ఉపకారం చేయాలనే చెప్పాను. ఆడమనసు నాకు తెలుసు. పైసాసంపాదన లేనివాడినైనా సహిస్తుంది. కానీ పిల్లలు పుట్టించలేని చేతగానితనాన్ని సహించదు. నీ భార్య దృష్టిలో నువ్వు చులకన కాగూడదనే విషయం దాచిపెట్టాను.

**యువకు :** ఎన్నాళ్ళు దాచగలం?

**ఆమె :** ఎన్నాళ్ళో అక్కర్లేదు. ఇపుడే నిజం చెప్పేద్దాం... అది చెప్పేముందు నువ్వొక విషయం చెప్పాలి.

**యువకు :** ఏమిటిది?

**ఆమె :** ఒక కన్ను లేనపుడు రెండో కన్నుతో చూడాలి. ఒక కాలు లేనపుడు ఉన్న కాలుతో నడవాలి. అలాగే నీ ద్వారా పిల్లలు పుట్టరని చెప్పాడుగానీ నీకు వారసులు పుట్టరని చెప్పలేదే.

**యువకు :** అంటే?

**ఆమె :** అంటే ఏముందీ? ఆవు మనింట్లో వుంటే చాలు – దూడ మనదైపోతుంది (చెవిలో చెప్పింది) అది నీకిష్టమైతే.

**యువకు :** ఎవరికీ తెలీదా?

**ఆమె :** వేరే వాళ్ళయితే తెలుస్తుంది... అందుకే ఇంట్లో మనిషినే ఎంచుకుందాం.

**యువకు :** వదినా! నువ్వు నాకీ సాయం చేస్తే నీకు ఇరవై లక్షలిస్తాను.

**అతడు :** (బయటి నుంచీ) ఒసేయ్... ఒసేయ్.

**ఆమె :** అదిగో, ఆంబోతులా అరుస్తూ వస్తున్నాడు... నువ్వు లోనికెళ్ళి దాన్ని ఒప్పించు... నేను అతడితో మాట్లాడి ఒప్పిస్తాను. (యువకుడు లోనికెళ్ళాడు)

**అతడు :** (వస్తూ) ఆ డాక్టర్ చెప్పింది సరిగ్గా విన్నావా... చూడిందులో ఏముందో?

**ఆమె :** చూడక్కర్లేదు. అందులో ఏముందో నాకు తెలుసు.

**అతడు :** తెలుసా?

**ఆమె :** అవును.

**అతడు :** తెలిసీ అబద్ధమెందుకు చెప్పావ్?

**ఆమె :** మిమ్మల్ని పెళ్ళికొడుకును చేద్దామని.

**అతడు :** ఏంటా కొత్త సరసాలు?

**ఆమె :** కొత్త సరసాలే మరి (కూర్చోపెట్టి చెవిలో చెప్పింది)

**అతడు :** (లాగిపెట్టి కొట్టి) అడ్డంగా నురుకుతా ఏమనుకున్నావో? మన కూతురు వయసుదే ఆ అమ్మాయి... ఆ మాటనడానికి నీకు నోరెలా వచ్చిందే? అది స్వంత కూతురికన్నా ఎక్కువే!

**ఆమె :** పనికిమాలిన సన్నాసీ! కాస్త నువ్వీ పని చేస్తే వాడు, వాడితో పాటు అమ్మాయి, దానితో పాటు ఆస్తీ మన చేతి కొస్తాయి. ప్రజలు ఓట్లు అమ్ముకున్నా, వేశ్యలు ఒళ్ళు అమ్ముకున్నా, నాయకులు పదవులు అమ్ముకున్నా అంతా డబ్బుకోసమే... ఇదంతా ఎవరికోసం? మన పిల్లల కోసం.

**అతడు :** ఈ పాపపు పని వద్దే.

**ఆమె** : పాపం పనీ పుణ్యం పనీ అంటూ లేవయ్యా! డబ్బు వచ్చే పనీ, డబ్బు రాని పనీ రెండే రెండు... ఏం కాదా? డబ్బు కోసం ఎన్ని అన్యాయాలు చేసినా ఫర్వాలేదు. మా దారికి నువు వచ్చితీరాలి. లేదంటే చూస్తూ నేనూరుకోను. నిన్ను చేయమన్న పని నన్ను చేయమంటే నీకు అనుమానం రాకుండా మేనేజ్ చేసి బిడ్డను కని వాడి చేతిలో పెట్టేదాన్ని! తెల్సిందా?

**అతడు** : ఛీ... (లోనికి వెళతాడు – ఆమె వెనకాలే వెళ్తుంది)

(యువతీ యువకులు లోనుంచీ వచ్చారు)

**యువకు** : ఒసేయ్! ప్లీజ్! ఒప్పుకోవా...నా మంచి పెళ్ళానివి కదూ ! ప్లీజ్!

**యువతి** : ఏమండీ, మిమ్మల్ని నా బిడ్డలా చూసుకుంటాను – ఇలాంటి ఊహ వద్దు. ఈ ఆస్తి పోయినా ఫర్వాలేదు.

**యువకు** : అదే నేనూ అంటున్నాను. కొందరికి ఆస్తిపోతే ఫర్వాలేదు, కొందరికి ప్రాణం పోతే ఫర్వాలేదు. ఇంకొందరికి అన్నీపోయినా ఫర్వాలేదు కానీ నాకు, నీ శీలం పోయినా ఫర్వాలేదు... ఆస్తి మాత్రం పోగూడదు... ఇదంతా ఓ ప్రయారిటీ కాంప్లెక్స్... నా ప్రయార్టీ నీ ప్రయార్టీ అనుకుని నెలరోజుల్లో నువ్వు నెల తప్పాలి... దట్సాల్...

**అతడు** : (లోనుంచి వస్తూ) ఆ మాట తలుచుకుంటూంటే ఒళ్ళు జలదరిస్తోందే, లోకవిరుద్ధంగా నేను చెయ్యలేను.

**ఆమె** : ఇది లోకవిరుద్ధం గాదు, పూర్వం రవికల పండగ చేసుకుని ఒకరి పెళ్ళాలతో ఒకరు డ్యాన్సులు చేసేవారు... తెలీకపోతే ఎలా?

**యువతి** : మీరేం చెప్పినా చేస్తాను... ఆ పాపపు పనిమాత్రం చేయను.

**ఆమె** : ఇందులో పాపం ఏముందే పిచ్చిదానా...పాండురాజులో పసలేదని కుంతీదేవి అయిదు మందితో అయిదుగుర్ని కంది.

**యువతి** : ఆమె మహాపతివ్రత.

**ఆమె** : నువ్వూ ఓ బిడ్డను కనివ్వు, గొప్ప పతివ్రతవు అయిపోదువుగానీ.

**యువతి** : మీ రెన్నన్నా చెప్పండి... నేను మాత్రం ఒప్పుకోను.

**ఆమె** : కళ్ళిచ్చినందుకు ఏదో ఒకటి చూస్తున్నాం... కాళ్ళిచ్చినందుకు ఎక్కడెక్కడికో నడుస్తున్నాం. అలాగే గర్భ సంచీ యిచ్చినందుకు, ఒక బిడ్డను కనివ్వాలి, ఎవరితోనైనా ఫర్వాలేదు.

**యువతి** : నోరిచ్చాడు గదా అని గడ్డయినా తింటామా? (వెళ్ళబోయింది–ఆమె అడ్డు తగిలింది చేపట్టి)

**యువకు :** తినాలి... బ్రతకాలంటే తినాలి - తిండే దొరక్కపోతే గడ్డేం ఖర్మ-అశుద్ధం అయినా తినాలి.

**యువతి :** నేను చావనైనా ఛస్తానుగానీ ఏది తినమంటే అది తినను.

**యువకు :** ఒసేయ్. నన్ను విసిగించకు... భార్యవని చూడకుండా పదిమందిని తీసుకొచ్చి రేప్ చేయిస్తాను.

**అతడు :** ఒరేయ్-ఒరేయ్. పురుగులు పడి ఛస్తావురా!

**ఆమె :** ఇదిగో మేంచెప్పినట్లు వినకపోతే నీ కళ్ళముందే పదిమంది మగాళ్ళతో నా ఇష్టం వచ్చినట్లు తిరుగుతాను - చూడలేక కుళ్ళి కుళ్ళి ఛస్తావ్.

**అతడు :** ఛీ...అమ్మా! వీళ్ళు మనుషుల ఆకారంలో వుండే రూపాయనోట్లు...నీకు అన్యాయం చేయకమానరు...ఎక్కడికన్నా వెళ్ళిపోమ్మా!

(యువతి వెళ్ళబోయింది)

**ఆమె :** ఎక్కడికే

**యువకు :** ఆగు...ఎక్కడికి వెళ్తావ్...?

**యువతి :** ఆ భగవంతుడు ఎక్కడ వుండమంటే అక్కడికి... (లోనికెళ్ళింది)

**ఆమె :** అది బయటికి పోయేట్లుందే!

**యువకు :** పోతేపోనీ, రెండో పెళ్ళి చేసుకుంటా.

**ఆమె :** పోయింది ఊరికే వుంటుందా... నీ బలహీనత గురించి ఊరంతా టాంటాం. వేసి చెప్తుంది. అదీగాక రెండో పెళ్ళానికైనా ఈ సచ్చినోడు ఒప్పుకోవాలిగా.

**యువకు :** ఒప్పుకోకపోతే చంపుతా!

**ఆమె :** చంపాల్సింది అతన్ని కాదు, నీ పెళ్ళాన్ని... అది ఇంట్లోంచి కాలు బయటపెట్టిందో రహస్యం బయటపడ్డట్లే... మీ దాయాదులంతా అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు.

**యువకు :** నిజమే! (యువతి సూట్‌కేస్‌తో వచ్చింది. యువతిని ఆమె పట్టుకుంది)

**ఆమె :** ఎక్కడికే బయలుదేరావ్... ఇంట్లో ఉండక? (కొట్టింది)

**అతడు :** (ఆమెను లాగి) అమ్మాయినేమన్నా అన్నావో నరికి పోగులు పెడతాను...నువ్వెళ్ళమ్మా!

**యువకు :** ఆగు...అడుగు ముందుకేస్తే అడ్డంగా నరుకుతా.

**అతడు :** నిన్నెవరూ ఏంచేయరు, నువ్వెళ్ళమ్మా!

(యువతి వెళ్ళబోతే యువకుడు జుట్టు పట్టుకుంటాడు అతడు విడిపించబోతాడు)

**ఆమె** : (అతన్ని పక్కకు లాగి) ఏయ్! మొగుడంటే లెక్క లేకుండా పోయిందా? పద లోపలికి.

(రెక్కలు విరిచి పట్టుకుంటుంది – అతడు ఆమెను వెనకనించి పట్టుకుంటాడు. యువకుడు అతన్ని, ఆమె యువతిని పక్కకులాగి కట్టిపడేస్తారు)

**ఆమె** : ఇది బతికున్నన్నాళ్ళూ ఈ దరిద్రుడు మన మాట వినడు. వెళ్ళి కిరసనాయిల్ అగ్గిపెట్టే. తీసుకురా, దీన్ని చంపేద్దాం.

(యువకుడు లోనికివెళ్ళి కిరసనాయిల్ డబ్బాతో వచ్చాడు)

**యువకు** : ఒక బిడ్డకు తండ్రి కావాలనుకోవడం ప్రకృతి ధర్మం... పరాయివాడితో బిడ్డను కనడం పాపం అనేది నీతిసూత్రం. ప్రకృతి ధర్మంకన్నా నీతిసూత్రం ఎప్పుడూ బలహీనమైనదే. అలాంటి బలహీనమైనదాన్ని బలంగా పట్టుకున్న పతివ్రతా, అందుకో నా ఆఖరి జోహార్...(కిరసనాయిల్ పోసి లైటర్ వెలిగించాడు)

(ప్రేక్షకుడు వేదికపైకి వచ్చాడు)

**1. ప్రేక్ష** : భలేగా చేశారయ్యా... నేనెలా చెప్పానో అలాగే ఆడారు బ్రహ్మాండం...

**ప్రయో** : (చిరాగ్గా వచ్చి) ఏంటండీ, మీరు నాటకం మధ్యలో వచ్చి disturb చేస్తారు ప్రతిసారీ. పూర్తిగా ఆడనివ్వరా?

**2. ప్రేక్ష** : ఇంకేంది భయ్ పూర్తిగా ఆడేది. నేనూ గీడ దాకానే చెప్పినా. ఆయనా గీడదాకనే చెప్పిండు.

**ప్రయో** : అసలు మేమేం చెప్పదలుచుకున్నామో పూర్తిగా చూడకుండా మధ్యలో ఆపేస్తారా!...

**1. ప్రేక్ష** : అంటే మేం చెప్పింది గాక – ఇంకా వేరేది వుందా!

**ప్రయో** : అవునండీ, మా రచయిత ఒక మంచి ఉద్దేశ్యంతో ఈ నాటకం రాశారు... ఆ సదుద్ధేశ్యాన్ని ఎంతమంది ప్రేక్షకులు గుర్తించగలరు అన్న ఆలోచనతోనే మేమీ పోటీ పెట్టాం... మరి నాటకం పూర్తిగా చూడకపోతే విషయం ఎలా తెలుస్తుంది సార్ మీకు?

**2. ప్రేక్ష** : గట్లయితే ఆయనేం చెప్పదలుచుకున్నాడో చెప్పరాదూ?

**ప్రయో** : చెప్పడం కాదు, చేసి చూపిస్తాం... (నటీనటులతో) రెడీయా...?

(మూడో ప్రేక్షకుడు వచ్చాడు)

**3. ప్రేక్ష** : మిస్టర్, కాస్తాగు.

**ప్రయో** : ఏంటిసార్!

**3. ప్రేక్ష** : వీళ్ళు చెప్పిందిగాక మరో విధంగా నాటకం ఆడి చూపిస్తావా?

ప్రయో : అవును సార్?

**3. ప్రేక్ష :** వద్దు బాబూ... ఇలా ఆడదాన్ని హింసపెట్టి తగలబెట్టే నాటకాలు ఆడకండి... ఆడదంటే అమ్మ బాబూ... ఆడదంటే ఆప్యాయత... మనిషి తర్వాత మనిషికి, తరం తర్వాత తరానికి ప్రాణం పోసే అమృతం బాబూ ఆడది... అలాటి స్త్రీని గౌరవించే నాటకం ఆడండి బాబూ. తగలబెట్టే నాటకాలు వద్దు.

ప్రయో : (ఆనందంగా) ఇదే సార్... ఇదే. ఈ స్పందనే మేము ప్రేక్షకుల నుంచి కోరుకున్నాం. ఆఁ! నాటకాలు చూసి ఎంతమందిలో చైతన్యం వస్తుందీ అనే తప్పుడు అభిప్రాయం వుంది సార్ ఈ సమాజంలో.

చింతామణి నాటకం చూసి ఎంతమంది చీకటి తప్పులు చేయడం మానేశారు? సత్యహరిశ్చంద్ర నాటకం చూసి ఎంతమంది అబద్ధాలు చెప్పడం మానేశారు? అని వితండవాదం చేసే చాలామందికి మీలాటి స్పందించిన ప్రేక్షకులే సార్ సమాధానం.

సార్... మా నాటకం మబ్బుల్లో బొమ్మ... అంటే ఆడది... ఆడదానిలో తల్లీ, చెల్లీ, భార్య– ఇలా రకరకాల రూపాలు మాత్రమే చూస్తాడు మగాడు. కానీ మనిషిలా చూడడు. ఆడదానికి ఇల్లుంటుంది కానీ ఇంటి పేరుండదు. స్త్రీకి ఆస్తిహక్కు ఆదినుంచీ వస్తున్న హక్కు. అది మాయచేసి, మోసం చేసి దోచుకున్నారు మగాళ్ళు.

ఆడవాళ్ళ ధ్యాసంతటినీ అలంకరణల మీదికి మళ్ళించి, ఆస్తి మీద తమదే హక్కు అంటున్నారు సార్ మగాళ్ళు... పుట్టినప్పటి నుంచీ చేతికి గాజులు. కాళ్ళకు పట్టీలు సంకెళ్ళలా తగిలించి హద్దులు గీశారు సార్ !

ఆడదాన్ని అమ్మోరిని చేసి ఆకాశంలో నిలబెట్టారు. దేవతను చేసి గుళ్ళో కూచోపెట్టారు. పూజలు చేశారు. హారతులు ఇచ్చారు. కానీ నిజ జీవితంలోకి వచ్చేసరికి ఆ గౌరవం గాలికి కొట్టుకుపోయి ఆ హారతులే మంటలై వాళ్ళను తగలబెడుతున్నాయి. ఇక ఈ దమనకాండ వద్దు.

స్త్రీలు కొలువుండాల్సింది గుడుల్లోకాదు సార్.. గుండెల్లో! ఎక్కడ స్త్రీలు పూజింపబడతారో అక్కడ దేవతలు వుంటారని అంటారు. కానీ ఎక్కడ స్త్రీలు గౌరవించబడతారో అక్కడ దేవతల అవసరమే లేదని మా ఉద్దేశ్యం.

ఈ రోజు స్త్రీ ఎదుర్కొంటున్న సమస్యలు ఎన్నో, ఎన్నెన్నో, ఆ సమస్య ఈయన చెప్పింది కావచ్చు. ఆయన చెప్పేది కావచ్చు. ఇక్కడున్న ఒక్కో ప్రేక్షకుడు ఒక్కో విధంగా చెప్పొచ్చు.. కానీ వీటన్నిటికీ బలయ్యేది మాత్రం స్త్రీ... స్త్రీ తననుతాను ఎలా కాపాడుకోగలగాలి అని చెప్పడమే మా నాటకం ఉద్దేశ్యం

సార్! ఇపుడు మేమేం చెప్తామో చూడండి-(నటీనటులతో) రెడీయా...? ఇందాక ఆయన చెప్పిన కథకే climax చూపిద్దాం... మీరలా వెళ్ళండి..OK (ప్రేక్షకులు వెళ్ళారు... యువకుడు కిరోసిన్ డబ్బాతో వచ్చాడు)

**యువకు :** ఒక బిడ్డకు తండ్రి కావాలనుకోవడం ప్రకృతి ధర్మం. పరాయివాడితో బిడ్డను కనటం పాపం అనేది నీతిసూత్రం. ప్రకృతి ధర్మం ముందు నీతిసూత్రం ఎపుడూ బలహీనమైనదే. అంత బలహీనమైనదాన్ని బలంగా పట్టుకున్న పతివ్రతా, అందుకో నా జోహార్.

(అగ్గిపుల్ల వెలిగించాడు)

(యువతి గింజుకుని ఒక్కసారి భద్రకాళిలా విజృంభించింది. ఆమెను, యువకుడిని చిత్తుగా కొట్టింది)

**యువతి :** (ఆమెతో) స్త్రీకి స్త్రీయే శత్రువనే విషయం మరోసారి నువ్వు రుజువు చేశావు. నీ స్వార్థం కోసం నా జీవితాన్ని నాశనం చేయాలని చూసిన నిన్ను వదలను.

(కొట్టింది)

(యువకుడితో) గుండెల్లో పెట్టుకుని కాపాడాల్సిన భర్తవి. నువ్వే నాకు సమాధి కట్టాలని చూస్తావా...? డబ్బు కోసం నన్ను నాశనం చేద్దామనుకున్న నిన్ను క్షమిస్తే మానవత్వాన్నే అవమానించినట్లవుతుంది. నైతిక విలువలకు నీళ్ళు వదిలిన నిన్ను వదలకూడదు (కొట్టింది)

**అతడు :** (లేచి) అమ్మా! ఒక్కసారి ఆలోచించు... ఎంతైనా వాడు నీ భర్త.

**యువతి :** ఆ స్థానానికి వీడు తగడు... అసలు మనిషిగా వుండటానికి కూడా వీడికి అర్హత లేదు. వీళ్ళు చేసిన పాపాలకు శిక్షపడాల్సిందే (అపరకాళిలా మారి ఇద్దర్ని చితకబాదుతుండగా ఫ్రీజ్ అయింది)

**ప్రయో :** పాముని పూజిస్తాం... పులిని చూసి భయపడతాం. అదే మేకను చూస్తే కూర వండుకు తింటాం. ఎందుకంటే, పాము బుస కొడ్తుంది. పులి పంజా విసుర్తుంది. మేక మన దౌర్జన్యాన్ని మౌనంగా భరిస్తుంది.

స్త్రీ కూడా మేకలా భరించినంతకాలం ఈ దౌర్జన్యకాండ ఆగదు... అందుకే తన సమస్యను పరిష్కరించుకోవడం కోసం, తన ఉనికిని కాపాడుకోవడం కోసం పాములా బుసకొట్టాలి, పులిలా పంజా విసరాలి. అవసరమైతే భద్రకాళిలా విజృంభించాలి... మేము చెప్పదలుచుకున్నది ఇదే... సెలవ్!